లక్ష ఓట్లు దాటితేనే విజేత..!

- పరిశీలకుల అంచనా
- మ్యాజిక్ ఫిగర్‌పై అభ్యర్థుల లెక్కలు
- గెలుపుపై ఇరుపక్షాల ధీమా



గాజువాక: ఈ ఎన్నికల్లో గాజువాక నియోజకవర్గంలో విజయం సాధించాలనుకున్న ఎమ్మెల్యే అభ్యర్థికి లక్ష నుంచి లక్షా పదహారు వేల ఓట్లు రావాల్సి ఉంటుంది. ఓటర్లు ఎటువైపు ఉన్నారో అర్థంగాక అభ్యర్థులు తర్జనభర్జన పడుతున్నప్పటికీ, గెలుపోటములపై మాత్రం రకరకాల విశ్లేషణలు చేస్తున్నారు. వార్డు స్థాయిలో తమదైన రీతిలో అనుచరులతో ఓటింగ్ సరళిపై వివరాలు సేకరించిన అభ్యర్థులు గెలుపునకు అవసరమైన మ్యాజిక్ ఫిగర్ తమదేనని అంటున్నారు. తమకున్న కేడర్‌తో బూత్‌లవారీగా ఓటింగ్ సరళి, తాము నియమించిన బూత్ ఏజెంట్ల నుంచి సమగ్ర వివరాలు సేకరించిన తరువాత వారు తమ గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్నారు.

గాజువాకలో ప్రస్తుతం 3,33,611 మంది ఓటర్లున్నారు. వారిలో 2,32,949 మంది ఓటింగ్‌లో పాల్గొన్నారు. 69.83 శాతం నమోదైన ఓటింగ్‌లో 1,14,844 మంది పురుషులు, 1,18,105 మంది మహిళలు ఓట్లు వేశారు. నియోజకవర్గం బరిలో 14 మంది అభ్యర్థులు నిలబడ్డారు. వారిలో ముగ్గురు స్వతంత్ర అభ్యర్థులు కాగా, మిగిలినవారు వివిధ పార్టీలకు చెందినవారు. పోటీని సీరియస్‌గా తీసుకున్న సీపీఎం అభ్యర్థి 15 వేల వరకు ఓట్లను సాధించగలుగుతారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. గత ఎన్నికల్లో స్వతంత్రంగా పోటీ చేసి 1,475 ఓట్లు సాధించిన కాంగ్రెస్ పార్టీ ఈసారి ఇండియా కూటమిలో భాగస్వామిగా ఉండటంతో గాజువాకలో సీపీఎం అభ్యర్థికి మద్దతు ఇచ్చింది. సీపీఐ కూడా అదే కూటమిలో భాగస్వామిగా ఉంది. 2,718 ఓట్లు సాధించిన బీజేపీ ఈసారి టీడీపీ కూటమిలో ఉంది. మరో 11 మంది సగటున వెయ్యి చొప్పున ఓట్లు తెచ్చుకుంటే పోలైన ఓట్లలో మొత్తం 26వేల ఓట్లు అందరూ పంచుకుంటారు. గత ఎన్నికల్లో నోటాకు 1,763 ఓట్లు వచ్చాయి. ఈ సారి కూడా నోటాకు అవే ఓట్లు వచ్చాయని అనుకుంటే ఇంకా మిగిలిన 2,05,186 ఓట్లను వైఎస్సార్‌సీపీ, టీడీపీ అభ్యర్థులు పంచుకోవాల్సి ఉంటుంది. ఈ ఓట్లను ఇద్దరు అభ్యర్థులు సమానంగా పంచుకున్నా విజయం సాధించాలంటే లక్ష ఓట్లకు పైగా పొందాల్సి ఉంటుంది. పోల్ అయిన ఓట్లలో సుమారు 50 శాతం వస్తేనే విజయం వరించనుంది. గెలుపోటములు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ, టీడీపీ అభ్యర్థుల మధ్యే ఉంటుందన్నది పరిశీలకుల అంచనా. ఈ నేపథ్యంలో వారిలో కనీసం ఐదారు వేల ఓట్లు మెజారిటీ సాధించాలన్నా ఆ అభ్యర్థి కనీసం 1.05 లక్షల ఓట్ల వరకు పొందాల్సి ఉంటుందని పరిశీలకులు అంటున్నారు.

బెట్టింగుల జోరు

అభ్యర్థుల గెలుపు, మెజార్టీలపై లక్షల్లో పందేలు



గాజువాక: సార్వత్రిక ఎన్నికల్లో గాజువాక నియోజకవర్గం అభ్యర్థుల విజయావకాశాలపై పెద్ద ఎత్తున బెట్టింగులు సాగుతున్నాయి. తాము అభిమానించే పార్టీ అభ్యర్థులు గెలుస్తారంటూ పలువురు లక్షలకు లక్షలు పందెం కడుతున్నారు. మరికొందరు గెలుపుపై కాకుండా ఏకంగా మెజార్టీపై లెక్కగట్టి మరీ పందెం కాస్తున్నారు.

గాజువాక నియోజకవర్గంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ, టీడీపీ మధ్య గెలుపోటములు ఉంటాయన్నది స్పష్టం కావడంతో పందెంరాయుళ్లు వారిద్దరిపైనే పందెం వేస్తున్నారు. ఇందులో ఉద్యోగులు, వ్యాపారులు, రియల్టర్లు పెద్ద సంఖ్యలో ఉన్నట్టు సమాచారం. తమతమ స్థాయిలకనుగుణంగా వెయ్యి రూపాయల నుంచి రూ.10 లక్షల వరకు పందాలు సాగుతున్నట్టు తెలుస్తోంది. ఇప్పటివరకు ఎన్నికల్లో సాగిన ఓటింగ్ సరళిపై అంచనాకు వచ్చిన పందెంరాయుళ్లు ఇప్పుడు తమ అభ్యర్థే గెలుస్తున్నారంటూ పందెం కాస్తున్నారు. పందెం కాసిన సొమ్మును ముందుగానే ఒక మధ్యవర్తి వద్ద ఉంచుతున్నట్టు తెలుస్తోంది. కొంతమంది ప్లాట్లు, ఫ్లాట్లు కూడా ఫణంగా పెడుతున్నట్టు సమాచారం. గాజువాక నియోజకవర్గం అసెంబ్లీ అభ్యర్థులపై నగదు రూపంలోనే కోటి రూపాయల వరకు పందెం వెళ్లినట్టు తెలిసింది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల విజయంపై బెట్టింగులు చేసేవారు అత్యంత ఆత్మవిశ్వాసాన్ని ప్రదర్శిస్తుండటం ప్రత్యర్థులల్లో కలవరం పుట్టిస్తోంది. 'మా అభ్యర్థి గెలిస్తే నాకు లక్ష ఇవ్వు, మీ అభ్యర్థి గెలిస్తే నీకు రెండు లక్షలు ఇస్తా'మంటూ కొంతమంది అభిమానులు పందెం వేసినట్టు చెప్పుకొంటున్నారు. ఈ విషయంలో టీడీపీ అభిమానులు సైతం వెనక్కి తగ్గని పరిస్థితి కనిపిస్తోంది. ఎగ్జిట్ పోల్ ఫలితాలను ఆధారం చేసుకుని పందెంరాయుళ్లు స్పీడ్ పెంచినట్టు చెబుతున్నారు.

క్లుప్తంగా

కిడ్నీ బాధితుడికి ఆర్థిక సాయం



సందీప్ కుటుంబ సభ్యులకు చెక్కు అందజేస్తున్న ఆర్డీవో హుస్సేన్‌సాహెబ్

పెదగంట్యాడ: పెదగంట్యాడ మండల పరిధిలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తూ కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న వై. సందీప్‌కు సంజీవని నిధి (డిస్ట్రిక్ట్ రిలీఫ్ ఫండ్) ద్వారా రూ.లక్ష ఆర్థిక సాయం అందింది. కలెక్టర్ మల్లికార్జున ఆదేశాల మేరకు విశాఖ రెవెన్యూ డివిజన్ అధికారి డి. హుస్సేన్‌సాహెబ్ గురువారం సందీప్ ఇంటికి వెళ్లి ఆయన కుటుంబ సభ్యులకు చెక్కు అందజేశారు. మందుల కొనుగోలు, ఇతర వైద్య ఖర్చుల నిమిత్తం సందీప్‌కు ఆర్థిక సాయం చేసినట్లు ఆర్డీవో తెలిపారు. ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎస్.ఎ. త్రినాథరావు కలెక్టర్‌కు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

కన్నారావుకు ఘన నివాళి



కన్నారావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉక్కు సిటూ నాయకులు

అగనంపూడి: కార్మికుల సమస్యలపై చిత్తశుద్ధితో పనిచేసిన కన్నారావు మృతి కార్మిక వర్గానికి తీరని లోటని సిటూ గౌరవాధ్యక్షుడు జె.అయోధ్యరామ్ అన్నారు. సిటూ అగనంపూడి కమిటీ ఇన్‌చార్జి దివంగత ఉప్పల కన్నారావు ప్రథమ వర్ధంతి సందర్భంగా అగనంపూడి సీడబ్ల్యూసీలో ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. కన్నారావు సేవలు చిరస్మరణీయమన్నారు. కార్యక్రమంలో సిటూ అధ్యక్షుడు వై.టి.దాస్, అగనంపూడి ఇన్‌చార్జి పెదిరెడ్ల నీలకంఠం, అఖిల పక్షాల నాయకులు శీరంశెట్టి గోవిందరావు, మడగల నరసింగరావు, పలకా రాము, అలమండ శ్రీను, బి.సత్యనారాయణ, ఎ.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

తిరుమలేశునికి విశేష అలంకరణ



కనకంబరాల అలంకరణలో తిరుమల బాలాజీ

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్‌లోని ఎస్టీబీఎల్ ప్రాంగణంలో కొలువై యున్న శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలోని స్వామి వారికి నిత్యం విశేష అలంకరణలు, ప్రత్యేక పూజలు చేస్తున్నారు. అందులో భాగంగా గురువారం స్వామి వారిని కనకంబరాలతో అలంకరించారు. దివ్యక్షేత్రంలో వేకువ జామునే భక్తులకు నేత్ర దర్శనం, సాయంత్రం నిజరూప దర్శనం కల్పించారు.

గ్రంథాలయంలో వేసవి శిక్షణ ప్రారంభం



విద్యార్థులతో కథలు పుస్తకాలు చదివిస్తున్న గ్రంథాలయ అధికారి పీవీ రమణ

పెదగంట్యాడ: స్థానిక శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు గురువారం వేసవి శిక్షణ శిబిరం ప్రారంభించారు. ఇందులో భాగంగా విద్యార్థులతో కథలు పుస్తకాలు చదివించారు. ఆ కథల్లోని నీతిని వివరించారు. అనంతరం విద్యార్థులతో ఆటలాడించారు. ఆపై వారికి బిస్కెట్లు, చాక్లెటు పంపిణీ చేశారు. గ్రంథాలయ అధికారి పీవీ రమణ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో 12 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

డెంగ్యూపై అవగాహన ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న ఆరోగ్య సిబ్బంది



స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లో ర్యాలీ చేస్తున్న మలేరియా సిబ్బంది

గాజువాక: జాతీయ డెంగ్యూ దినోత్సవాన్ని పురస్కరించుకుని గాజువాక పీహెచ్‌సీ సిబ్బంది గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఎం.సుధాకర్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీలో సిబ్బంది, దోమల నివారణపై స్థానికులకు అవగాహన కల్పించారు. దోమలు వ్యాప్తి చెందకుండా ఉండటం కోసం ప్రతీ శుక్రవారం డ్రైడే పాటించాలని వివరించారు. లార్వా దశలోనే దోమల పుట్టుకను నాశనం చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో గాజువాక పీహెచ్‌సీ సామాజిక ఆరోగ్య విస్తరణాధికారి పి.నాగ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లో ..

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లో గురువారం డెంగ్యూ అవగాహన ర్యాలీ నిర్వహించారు. గాజువాక మలేరియా యూనిట్ సీనియర్ ఎంటమాలజిస్ట్ కె. వరహాలదొర పర్యవేక్షణలో కాలనీలో ర్యాలీ నిర్వహించారు. డెంగ్యూ రాకుండా తీసుకోవలసిన చర్యలపై బ్యానర్లు, ప్లకార్డులు ప్రదర్శిస్తూ అవగాహన కల్పించారు. హెల్త్ ఇన్‌స్పెక్టర్లు కుమార్, నాయుడు మాట్లాడుతూ ఈడెస్ అనే దోమకాటు వల్ల డెంగ్యూ వస్తుందన్నారు. ఇంట్లో, పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకుంటే దోమలను నివారించవచ్చని, తద్వారా డెంగ్యూకు చెక్ పెట్టవచ్చని అన్నారు. ప్రతీ శుక్రవారం డ్రై డే పాటించాలన్నారు. కార్యక్రమంలో పబ్లిక్ హెల్త్ విభాగం సిబ్బంది చలపతిరావు, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ హెచ్‌ఆర్ జీఎంకు అభినందనలు



స్టీల్‌ప్లాంట్ హెచ్‌ఆర్ జీఎం భానును అభినందిస్తున్న అధికారులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ హెచ్‌ఆర్ జీఎం ఎస్.భానును ప్లాంట్ దళిత అధికారులు అభినందించారు. ప్లాంట్ హెచ్‌ఆర్ ఎస్సీ, ఎస్టీ సెల్ ఇన్‌చార్జిగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా వారు గురువారం ఆమెకు శాలువా కప్పి, పుష్పగుచ్ఛంతో సత్కరించారు. భాను భవిష్యత్తులో మరిన్ని ఉన్నత స్థానాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. దీనిపై భాను మాట్లాడుతూ క్రమశిక్షణ, అంకితభావం, సమయస్ఫూర్తి, వ్యక్తిగత వికాసం ఉంటే మిగతా సమాజంతో పాటు సమాంతరంగా గౌరవంగా ఉండగలమన్నారు. కార్యక్రమంలో అధికారులు శ్రీహరి, బి.ఎ.స్వామి, ఎస్.శ్రీనివాసరావు, జొన్నకూటి విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేయాలి



మాట్లాడుతున్న సురేష్

అగనంపూడి: సంస్థలో సభ్యత్వం పొందిన ప్రతీ ఒక్కరూ మానవ హక్కుల పరిరక్షణ కోసం అవగాహన కల్పించడంతో పాటు చిత్తశుద్ధితో పనిచేయాలని ప్రపంచ మానవ హక్కుల అవగాహనా సంఘం రాష్ట్ర చైర్మన్ పత్తిపాటి సురేష్ అన్నారు. అగనంపూడి సీడబ్ల్యూసీలో నిర్వహించిన కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంస్థ పట్ల ఆసక్తితో ఉన్న వారికి మాత్రమే సభ్యత్వం ఉంటుందన్నారు. సంఘం పట్ల ప్రజలకు ఉన్న నమ్మకాన్ని ఒమ్ము చేయకుండా నిస్వార్థంతో అంకితభావంతో పనిచేయాలన్నారు. కార్యక్రమంలో ఉత్తరాంధ్ర రీజనల్ చైర్మన్ ఎలుగుబంటి సత్యనారాయణ, విశాఖ జిల్లా అధ్యక్షుడు మోటూరి వెంకటరమణ, సంఘ ఉత్తరాంధ్ర జిల్లాల సలహాదారు బలిరెడ్డి సత్యనారాయణ, ప్రతినిధులు విందుల నారాయణరావు, దాసరి జయలక్ష్మి, జి.పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

జీవనశైలిలో మార్పులతో అదుపులో రక్తపోటు



డాక్టర్ నారాయణ రాజు

అక్కిరెడ్డిపాలెం: జీవనశైలిలోని మార్పులతో రక్తపోటును అదుపులో ఉంచుకోవచ్చని షీలానగర్ కిమ్స్ ఐకాన్ కన్సల్టెంట్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ కె.నారాయణ రాజు అన్నారు. మే 17న అంతర్జాతీయ రక్తపోటు దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆస్పత్రిలో గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ హృదయ సంబంధ వ్యాధులు, స్ట్రోక్‌కు అధిక రక్తపోటు ప్రధాన కారణమన్నారు. చాలామందికి రక్తపోటు ఉందనే విషయం తెలియకుండా జీవిస్తున్నారన్నారు. రక్తపోటు లేని వ్యక్తి సాధారణంగా బీపీ పరీక్షలో 120 ఎంఎంహెచ్‌జీ సిస్టోలిక్, 80 ఎంఎంహెచ్‌జీ డయాస్టోలిక్ కలిగి ఉండాలన్నారు. ఆహార మార్పుల ద్వారా రక్తపోటు స్థాయిని క్రమబద్ధీకరించుకోవచ్చని తెలిపారు. ఆల్కహాల్ వినియోగాన్ని నియంత్రిస్తే రక్తపోటులో స్థాయి తగ్గించడంలో సహాయపడుతుందన్నారు. శారీరక శ్రమలో భాగంగా నిత్యం కొన్ని నిమిషాల పాటు చురుకైన నడక, సైక్లింగ్, స్విమ్మింగ్ వంటి ఏరోబిక్ వ్యాయామాలతో పాటు, వయసును బట్టి ఆహార నియంత్రణను పాటించి రక్తపోటును అదుపులో ఉంచుకోవచ్చని తెలియజేశారు.

పెద్దలకు బీసీజీ వ్యాక్సినేషన్ ప్రారంభం



వ్యాక్సిన్ వేస్తున్న ఆరోగ్య సిబ్బంది

గాజువాక : 60 ఏళ్లు దాటినవారంతా అడల్ట్ బీసీజీ వ్యాక్సిన్ వేయించుకోవాలని గాజువాక పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఎం.సుధాకర్‌రావు కోరారు. అడల్ట్ బీసీజీ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని పీహెచ్‌సీలో గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 60 ఏళ్లు దాటిన వారిలో సుగర్, బీపీ ఉన్నవారికి, అలాగే టీబీ వచ్చి ట్రీట్‌మెంట్ తీసుకున్న వారికి.. వారి ఇంట్లో 18 ఏళ్లు నిండినవారికి జీవితంలో టీబీ రాకుండా ఉండటానికి ప్రభుత్వం బీసీజీ వ్యాక్సినేషన్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. సచివాలయాల్లో ప్రతీ గురువారం ఈ వ్యాక్సిన్ వేస్తారని, 60 ఏళ్లు దాటినవారు ఈ వ్యాక్సిన్ వేయించుకోవాలని సూచించారు. 3 నెలల పాటు ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సామాజిక ఆరోగ్య విస్తరణాధికారి పి.నాగ అప్పారావు, హెల్త్ సూపర్‌వైజర్లు జి.రాము, రత్నాలు తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీపీసీలో స్వచ్ఛత పక్వాడ



ఉద్యోగులతో కలిసి ప్రతిజ్ఞ చేస్తున్న ప్రాజెక్టు హెడ్ సిన్హా

పరవాడ: పరిసరాల పరిశుభ్రతకు ప్రతి ఒక్కరు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సింహాద్రి ఎన్టీపీసీ ప్రాజెక్ట్ హెడ్ సంజయ్‌కుమార్ సిన్హా అన్నారు. దీపాంజలినగర్‌లోని సవ్యాస్ భవనంలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్టీపీసీ సింహాద్రిలో ఈ నెల 16 నుంచి 31 వరకు నిర్వహించనున్న స్వచ్ఛత పక్వాడ కార్యక్రమాన్ని ప్రారంభించి ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. 15 రోజుల పాటు నిర్వహించనున్న స్వచ్ఛత పక్వాడ కార్యక్రమంలో ప్రజలకు పరిశుభ్రతపై అవగాహన కల్పించడానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీజీఎం సీపీజీ-3 రష్మీ రంజన్ పరిధా, ఆపరేషన్ జీఎం సురేష్ జాన్ డేవిడ్, వీజీజీ జీఎం నోవాహు గడ్డం, టెక్నికల్ సర్వీసెస్ జీఎం ఎస్.పద్మప్రియ, హెచ్‌ఆర్ హెడ్ బి.బి.పాత్ర, జీఎంలు, ఇతర అధికారులు, అసోసియేషన్ ప్రతినిధులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

కుటుంబం చెంతకు మహిళ



కుమారుడు, కుమార్తెతో బసుమతి మండల్

అల్లిపురం : గత ఏడాది డిసెంబర్‌లో తమకు అందిన సమాచారం మేరకు భీమిలిలో మతిస్థిమితం లేకుండా తిరుగుతున్న ఒక మహిళను ఏయూటీడీ టీఎస్‌ఆర్ కాంప్లెక్స్ సిబ్బంది తీసుకొచ్చి ఆశ్రయం కల్పించారు. వసతి గృహంలో ఉండగానే ఆమెకు చికిత్స అందించడంతో ప్రస్తుతం ఆమె కోలుకుని తన వివరాలు చెప్పగలిగింది. తన పేరు బసుమతి మండల్ అని, తమది పశ్చిమ బెంగాల్‌లోని నదియా జిల్లాకు చెందిన మొల్లాబెలియా గ్రామమని స్పష్టం చేసి.. తమ చిరునామా కూడా తెలిపింది. దీంతో ఏయూటీడీ సిబ్బంది పూణేలోని శ్రద్ధా ఫౌండేషన్ ప్రతినిధులకు సమాచారం అందజేశారు. వారు మహిళ కుమారుడు గోపాల్ మండల్, కుమార్తెకు అప్పగించారు. ఈ సందర్భంగా ఆమె కుమారుడు గోపాల్ మండల్ మాట్లాడుతూ తమ తండ్రి వేరే పెళ్లి చేసుకుని బెంగళూరు వెళ్లిపోయాడని, తన సోదరితో కలిసి కిరాణా దుకాణం నడుపుకుంటూ జీవిస్తున్నట్లు తెలిపాడు. తమ తల్లిని అప్పగించినందుకు ధన్యవాదాలు తెలిపాడు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



నిత్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామికి గురువారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణ పుష్పార్చన వైభవంగా నిర్వహించారు. ఆలయ బేడా మండపంలో ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై వేంజేపచేశారు. 108 స్వర్ణ సంపెంగలతో స్వామికి అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదాన్ని అందజేశారు. ఆలయ ఏఈవో ఎన్.ఆనంద్ కుమార్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

వైభవంగా నిత్య కల్యాణం

వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఉదయం 9.30 గంటల నుంచి నిత్య కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవి ఉత్సవమూర్తులను బేడా మండపంలో వేదికపై వేంజేపచేసి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఉభయ దాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదాన్ని అర్చకులు అందజేశారు.

18 నుంచి కేరళ ఆయుర్వేద శిబిరం

డాబాగార్డెన్స్: ఆయుర్వేద పంచకర్మ విధానం ద్వారా దీర్ఘకాల రోగాలకు చికిత్స అందించేందుకు ఈ నెల 18 నుంచి 21 వరకు కేరళ ఆయుర్వేద శిబిరం నిర్వహించనున్నట్టు వైద్యరాజ్ ఔషధాలయ మేనేజర్ దినూప్ తెలిపారు. ఈ మేరకు గురువారం నగరంలోని ఓ హోటల్లో ఆయన మాట్లాడారు. ప్రముఖ కేరళ వైద్యుడు డాక్టర్ కేఎం ఉన్నికృష్ణన్ నాయర్ 4 రోజుల పాటు ఈ కేంద్రంలో అందుబాటులో ఉంటారని తెలిపారు. డాక్టర్‌ను సంప్రదించాలనుకునేవారు అపాయింట్‌మెంట్ కోసం 7675861446, 0891-2568264 నంబర్లలో సంప్రదించవచ్చన్నారు. చర్మవ్యాధులు, ఆర్థరైటిస్, సొరియాసిస్, ఒత్తిడి, ఈఎన్‌టీ సమస్యలు, హైపర్ టెన్షన్, కీళ్ల వ్యాధులు, నడుం నొప్పి, స్పాండిలైటిస్, మానసిక ఒత్తిడి, నిద్రలేమి, రుమాటిజం వంటి సమస్యలతో బాధపడే వారికి వైద్య శిబిరంలో డాక్టర్ నాయర్ అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు.

శ్రీవారి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ



బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుడుతున్న అర్చకులు



శ్రీవారికి ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు

పెందుర్తి : వెంకటాద్రిపై కొలువైన వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. విష్వక్సేన ఆరాధన, పుణ్యావహవచనం, అంకురార్పణ, మృత్సంగ్రహణం, యాగశాల అర్చన, అగ్ని ప్రతిష్ఠ జరిగాయి. వెంకన్నకు ప్రత్యేక పూజలు చేశారు. ఐదు రోజుల పాటు నిర్వహించనున్న ఈ ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు శుక్రవారం ఉదయం ధ్వజారోహణ, హోమాలు చేస్తారు. సాయంత్రం లక్ష తులసి, మల్లికా పుష్పాలతో స్వామివారికి విశేష అర్చనలు జరుగుతాయి. మూడో రోజు శనివారం వైశాఖ శుద్ధ దశమి సందర్భంగా సాయంత్రం స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించనున్నారు. నాలుగో రోజు ఆదివారం సాయంత్రం తిరువీధి ఉత్సవంలో భాగంగా స్వామివారి రథోత్సవం జరగనుంది. వెంకటాద్రి నుంచి పెందుర్తి పురవీధుల్లో స్వామివారు రథంపై పయనిస్తూ చినముషిడివాడ సప్తగిరినగర్‌లోని అలివేలు మంగమ్మ సన్నిధి వరకు సాగుతూ భక్తులకు ఆశీస్సులు అందిస్తారు. ఆఖరి రోజు సోమవారం ఉదయం స్వామి వారికి చక్రస్నానం, చక్రత్తాళ్వారులతో కలిసి దివ్య స్నానమాచరిస్తారు. సాయంత్రం పుష్పయాగం, మహా పూర్ణాహుతి, ద్వాదశారాధన, స్వామివారికి విశేష అర్చనలు, ఊంజల్ సేవతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని ఆలయ ప్రతినిధులు వెల్లడించారు. తొలిరోజు పూజల్లో ఈవో నీలిమ, ఆలయ ప్రధాన అర్చకుడు రామానుజాచార్యులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

యువకుడి అనుమానాస్పద మృతి



మృతుడు వద్దాది మహేష్

అక్కిరెడ్డిపాలెం: గాజువాక వై జంక్షన్ వద్ద ఓ యువకుడు అనుమానాస్పదంగా మృతి చెందాడు. రాత్రి సమయంలో యువకుడు రోడ్డుపై రక్తపు మడుగులో పడి ఉండటాన్ని గుర్తించిన కొందరు గాజువాక పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలు సేకరించి, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. గాజువాక సీఐ ఎం.శ్రీనివాసరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. స్వతంత్ర నగర్‌కు చెందిన వద్దాది మహేష్ (25) గాజువాకలోని వై జంక్షన్ పరిసరాల్లో ఉన్న వెల్డింగ్ షాపులో వెల్డర్‌గా పని చేస్తున్నారు. మహేష్ రోడ్డు దాటే క్రమంలో ఏదైనా గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టి మృతి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. అయితే, మహేష్ రక్తపు మడుగులో పడి ఉండటం అనుమానాలకు తావిస్తోందని కుటుంబ సభ్యులు అంటున్నారు. ప్రమాదం జరిగిన ప్రాంతంలో విద్యుత్ లైట్లు లేకపోవడంతో ఏ జరిగిందన్న విషయం తెలియాల్సి ఉంది. మృతుని తల్లి నాగమణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టనున్నట్లు సీఐ శ్రీనివాసరావు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. మృతుడు మహేష్ అవివాహితుడు. తండ్రి అప్పల స్వామి ఉన్నారు.

అందంగా.. ఆకర్షణీయంగా..

- చూడముచ్చటగా డాల్ఫిన్ కూడలి
- సరికొత్తగా సీహార్స్ ప్రతిమలు
- అదనపు హంగులతో జ్ఞానాపురం అంబేడ్కర్ జంక్షన్
- పచ్చదనం నడుమ వైజాగ్ పోర్ట్ సింబల్



డాల్ఫిన్ జంక్షన్‌లో ఏర్పాటు చేసిన వాటర్ ఫౌంటైన్



ఆకట్టుకుంటున్న వైజాగ్ పోర్ట్ సింబల్

జగదాంబ : విశ్వనగరంగా ఖ్యాతి గడిస్తున్న విశాఖ రోజురోజుకు సరికొత్త అందాలను సంతరించుకుంటోంది. కాస్మోపాలిటన్ అందాలతో శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. ఈ నేపథ్యంలో దక్షిణలోని పలు ఏరియాలు మునుపెన్నడూ చూడనంత అందంగా.. ఆకర్షణీయంగా రూపొంది చూపరుల చేత 'వావ్..'అని పిస్తున్నాయి.

దేనికదే సాటి..

అల్లిపురం దరి డాల్ఫిన్ జంక్షన్‌లో ఏర్పాటు చేసిన ఫౌంటెయిన్ ఆ ప్రాంతానికి కొత్త అందాలద్దుతోంది. గ్రీన్ సర్కిల్ నడుమ రెండు డాల్ఫిన్లు నీటిని బయటికి వెదజల్లుతున్నట్లు ఏర్పాటు చేసిన ప్రతిమలు అటుగా ప్రయాణించే వాహన చోదకులు.. పాదచారులను ఆకట్టుకుంటున్నాయి. అదే విధంగా పోర్టు ముఖద్వారం వద్ద గల సీహార్స్ (సముద్ర గుర్రాలు) కొంత కాలం క్రితం శిథిలమైపోయాయి. అయితే ఇటీవల వాటికి మరమ్మతు చేసి సరికొత్తగా తీర్చిదిద్దారు. రౌండ్ రెయిలింగ్ ఏరియాలో ఏర్పాటు చేసిన సీహార్స్ చూపరుల మనసు దోచుకుంటున్నాయి. అలాగే జ్ఞానాపురంలో ఏర్పాటు చేసిన వైజాగ్ పోర్ట్ సింబల్ కూడా ఆకర్షణీయంగా రూపుదిద్దుకుంది. గ్రీనరీ, స్టీల్ రెయిలింగ్ నడుమ ఏర్పాటైన ఆ సింబల్ జ్ఞానాపురం ప్రాంతానికి సరికొత్త అందాలు తెచ్చిపెట్టింది. ఇక చివరిగా జ్ఞానాపురంలోనే ఏర్పాటైన అంబేడ్కర్ కూడలి కూడా చూడముచ్చటగా రూపుదిద్దుకుంది. చక్కటి సర్కిల్‌లో పూలమొక్కలు, రంగులు, విద్యుత్ కాంతులతో ఏర్పాటు చేసిన ఈ ప్రతిమ ఆ ప్రాంతం నుంచి చాలా దూరం వరకు కనిపించేలా సుందరంగా తీర్చిదిద్దారు.